
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 10 । ఆగస్టు । 2023



సోమశిలలో 22.86 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో బుధవారానికి 22.861 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 487 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.61,030
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,481
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,645
నవర (8 గ్రాములు)	రూ.45,160

గరిష్ఠం/కనిష్ఠం
37.5 /29.0

వాతావరణం

వాతావరణంలో తేమ 46 శాతంగా ఉంది. జిల్లావ్యాప్తంగా పొడి వాతావరణం గురువారం ఉంటుందని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

గంజాయి తరలిస్తున్న కారు బోల్తా



ధ్వంసమైన కారు, లభ్యమైన గంజాయి ప్యాకెట్లను పరిశీలిస్తున్న పోలీసులు

నెల్లూరు రూరల్: గంజాయి తరలిస్తున్న ఓ కారు అతివేగంగా వెళ్తూ బోల్తాపడిన ఘటన కొండాయపాళెం సమీపంలోని జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. కారులో సుమారు 75 కిలోల బరువుగల 25 గంజాయి ప్యాకెట్లను పోలీసులు గుర్తించారు. వివరాలు.. విజయవాడ నుంచి చెన్నై వైపు వెళ్తున్న కేరళ రిజిస్ట్రేషన్ కారు టైరు పాత శ్రీహరి దాబా సమీపానికి వచ్చేసరికి పంక్చరైంది. దీంతో కారు అదుపు తప్పి పల్టీలు కొడుతూ పక్కనే కాలువ దాటి బోల్తాపడింది. ప్రమాదం జరిగిన వెంటనే కారులోని వ్యక్తులు అద్దాలను పగలగొట్టి బయటకొచ్చి నగదు, సెల్‌ఫోన్లను తీసుకొని సమీపంలోని పొలాల వైపు పరారయ్యారు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ డీఎస్పీ అబ్దుల్ సుబహాన్ తన సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకున్నారు. రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి, సీఐ శ్రీనివాసులు రెడ్డి, సిబ్బందితో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. కారులో గంజాయి ప్యాకెట్లతో పాటు రెండు కత్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉన్న చెక్‌పోస్టులను పోలీసులు అప్రమత్తం చేశారు. కేరళ, కర్ణాటక రిజిస్ట్రేషన్ కలిగిన వాహనాలను తనిఖీ చేయాల్సిందిగా పోలీస్ ఉన్నతాధికారులు ఆదేశించారు.

ఈవీఎంల గోడౌన్ వద్ద పటిష్ట భద్రత



పరిశీలిస్తున్న కలెక్టర్

నెల్లూరు రూరల్: ఈవీఎంల గోడౌన్ వద్ద పటిష్ట భద్రత, నిఘా ఎంతో అవసరమని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా నెల్లూరు ఆర్డీఓ కార్యాలయ ఆవరణలోని ఈవీఎంల గోడౌన్‌ను కమిషనర్ వికాస్ మర్మత్‌తో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈవీఎంలు, వీవీప్యాట్స్, బ్యాటరీలను పరిశీలించిన అనంతరం కలెక్టర్ మాట్లాడారు. గోదాము వద్ద తగిన విధంగా భద్రత ఏర్పాట్లపై అధికారులను అప్రమత్తం చేశామన్నారు. నెల్లూరు అర్బన్ తహసీల్దార్ నిర్మలానందబాబా తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన ఆహార అలవాట్లు అవసరం



ర్యాలీని ప్రారంభిస్తున్న కూర్మనాథ్

నెల్లూరు(దర్గామిట్ట): ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో శారీరక వ్యాయామంతో పాటు మెరుగైన ఆహార అలవాట్లు ఎంతో ముఖ్యమని జేసీ కూర్మనాథ్ పేర్కొన్నారు. నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో మత్స్యశాఖ, భూమి ఆర్గానిక్స్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 13 వరకు చేపట్టనున్న సీ ఫుడ్ ఫెస్టివల్‌ను జయప్రదం చేయాలని కోరుతూ వీఆర్సీ సెంటర్ నుంచి కస్తూరిదేవి గార్డెన్స్ వరకు ర్యాలీని బుధవారం నిర్వహించారు. జేసీకి భూమి ఆర్గానిక్స్ సంస్థ ఎండీ రఘురామ్ పుష్పగుచ్ఛాన్ని అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడారు. సీ ఫుడ్ ఫెస్టివల్లో వివిధ రకాల చేపలు, రొయ్యలు, పీతలతో చేసిన వంటకాలు మాంసాహార ప్రియులను అలరిస్తాయని చెప్పారు. మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, నాబార్డు డీడీఎం రవిసింగ్, బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సమావేశాలు నేడు

నెల్లూరు (టౌన్): జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో పేరెంట్స్, ఉపాధ్యాయులతో సమావేశాలను గురువారం నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయం నుంచి జిల్లా కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. బోధనాభ్యాసన కార్యక్రమాలు, ప్రమాణాల పెంపు అంశాల్లో పేరెంట్స్ కమిటీలను రాష్ట్ర ప్రభుత్వం భాగస్వాములు చేసింది. పాఠశాలల్లో విద్యార్థుల సమస్యలు, లోపాలుంటే సరిదిద్దుకునేందుకు ఈ సమావేశాలు ఉపయోగపడనున్నాయి.

బొప్పాయ్.. భలే లాభాలోయ్



బొప్పాయి సాగు రైతులకు సిరులు కురిపిస్తోంది. రెండేళ్ల కాలపరిమితి పంటైనా సాగు చేసిన ఏడాదికే అన్నదాతలు లాభాలను ఆర్జిస్తున్నారు. ప్రభుత్వం సైతం ప్రోత్సాహాన్ని అందిస్తూ సబ్సిడీపై మల్చింగ్ షీట్లు, తదితరాలను సమకూరుస్తుండటంతో సాగు చేసే వారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది.

- జిల్లాలోని 11 మండలాల్లో 1500 హెక్టార్లలో సాగు
- ఆధునిక పద్ధతుల్లో సాగుకు రైతుల మొగ్గు
- అంతర్ పంటలతోనూ అధిక ఆదాయం
- రాయితీలతో ప్రభుత్వ ప్రోత్సాహం

ఆత్మకూరు: బొప్పాయి సాగు రైతుల పాలిట కల్పతరువుగా మారింది. అన్నదాతలు లాభాలు చవి చూస్తుండగా.. తింటున్న వారి ఆరోగ్యం బాగుపడుతుండటంతో బొప్పాయి అందరికీ అనుకూలంగా మారింది. జిల్లాలోని 11 మండలాల్లో 1500 హెక్టార్లలో బొప్పాయి సాగవుతోందని అధికారిక లెక్కలు తెలియజేస్తున్నాయి.

ఏడు నెలలకే తొలి కాపు

వాస్తవానికి రెండేళ్ల కాలపరిమితి గల బొప్పాయిని ఆధునిక పద్ధతుల్లో సాగుచేస్తూ ఏడాదికే లాభాలు గడిస్తున్నారు. రెండో పంటనూ వెంటనే చేపడుతున్నారు. ఈ కారణంగా కొంత ఖర్చయినా లాభాలు వస్తుండటంతో రెండేళ్ల కాలపరిమితిని రైతులు పాటించడంలేదు. ఏడు నెలలకే తొలి కాపు వచ్చే బొప్పాయి తోటల్లో అంతర్‌పంటగా బంతిని సాగు చేస్తూ అదనపు ఆదాయాన్ని గడిస్తున్నారు. కచ్చితమైన లాభాలు వస్తుండటంతో అధిక శాతం మంది బొప్పాయి సాగు వైపు మొగ్గు చూపుతున్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహం

ఉద్యాన పంటలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తుండటంతో బొప్పాయి సాగుకు పలువురు రైతులు ఆసక్తి చూపుతున్నారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో డ్రిప్ ఇరిగేషన్‌ను ప్రోత్సహిస్తూ.. మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ ద్వారా హెక్టార్‌కు 90 శాతం సబ్సిడీతో అందిస్తోంది. కలుపు నివారణకు మల్చింగ్ చేసేందుకు తొలి ఏడాది రూ.18,490, రెండో సంవత్సరం రూ.ఆరు వేలను రైతులకు అందిస్తున్నారు. మల్చింగ్ షీట్ల ఏర్పాటుతో వర్షాకాలంలో వేరుకుళ్లు తెగులు సోకదని, వీటితో సాగు చేయాలని అధికారులు సూచిస్తున్నారు.



బొప్పాయి తోట



> **ఎకరాకు 40 టన్నుల దిగుబడి**
>
> ఎకరాలో బొప్పాయి సాగుకు రూ.70 వేలు ఖర్చవుతోంది. కలుపు రాకుండా మల్చింగ్ షీట్ల ఏర్పాటు, డ్రిప్ ఇరిగేషన్, తదితర ఆధునిక పద్ధతులతో సాగు చేస్తే రూ.లక్ష వరకు అవుతోంది. మొక్కలు నాటిన అనంతరం ఏడు నెలల పది రోజులకే తొలి కాపు చేతికందుతుంది. తొలి కాపులో ఒక టన్ను నుంచి ఒకటిన్నర టన్నుల దిగుబడి.. 20 రోజుల అనంతరం రెండో కాపులో రెండు నుంచి మూడు టన్నులు.. మూడో కాపులో నాలుగు నుంచి ఐదు టన్నుల దిగుబడి వస్తోంది. ఏడాది పొడవునా కాపు ఉంటుందని రైతులు తెలిపారు. దీంతో ఎకరాకు రూ.మూడు లక్షలకుపైగా ఆదాయాన్ని గడిస్తున్నారు.

సోలాపూర్ రకానికి ప్రాధాన్యం

బొప్పాయిలో తైవాన్ రెడ్ లేడీ 786 రకానికి మరో పేరు సోలాపూర్ వెరైటీ. ఈ రకం సాగుకు రైతులు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. సోలాపూర్ వెళ్లి మొక్కలు తెస్తుండటంతో తైవాన్ రెడ్ లేడీ పేరు స్థానంలో ఈ పేరొచ్చిందని రైతులు తెలిపారు. ప్రస్తుతం అనంతపురం, రైల్వేకోడూరు నుంచి రైతులు ఈ రకం మొక్కలను తీసుకొస్తున్నారు. ఎకరాకు 1200 వరకు వేయాల్సి ఉన్నా, రైతులు 1050 మొక్కల చొప్పున సాగు చేస్తున్నారు.

అధిక ధర

సాధారణంగా కాయలను విడిగా రూ.8.50 చొప్పున రైతులు విక్రయిస్తుంటారు. అయితే గతేడాది ఒక్కో కాయను రూ.16 చొప్పున రైతుల వద్దే కొనుగోలు చేయడంతో ఎకరాకు రూ.నాలుగు లక్షలకుపైగా ఆదాయం సమకూరింది. ఈ ఏడాది రూ.పది చొప్పున విక్రయిస్తున్నామని వారు చెప్పారు.

ప్రథమ స్థానంలో ఆత్మకూరు సెక్టార్

ఆత్మకూరు సెక్టార్‌లో 400 ఎకరాలకుపైగా బొప్పాయి సాగవుతూ ప్రథమ స్థానంలో ఉందని ఉద్యానాధికారులు తెలిపారు. చేజర్ల, ఏఎస్‌పేట, మర్రిపాడు, పొదలకూరు, మనుబోలు, కలువాయి, తదితర మండలాల్లోనూ అధికంగా సాగు చేస్తున్నారు. వైద్యుల సూచన మేరకు బొప్పాయి వినియోగం పెరగడంతో కొనుగోళ్లు భారీగానే జరుగుతున్నాయి.

లాభాలు బాగున్నాయి



గతంలో బొప్పాయి సాగు చేశా. కొంత ఆదాయమే వచ్చింది. ఏడాదికే పంట తీసేసి మొక్కలు తెచ్చి రెండో పంట వేశా. ఈ ఏడాది ధర బాగుంది. మంచి ఆదాయాలొస్తాయనే ఆశతో ఉన్నా. ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది.

– నాగరాజారెడ్డి, రైతు, పొంగూరు

మా తోట చూసి పలువురు సాగు చేస్తున్నారు



మూడేళ్లుగా బొప్పాయి సాగు చేస్తున్నా. లాభాలు బాగానే ఉన్నాయి. మా తోటను చూసి సమీపంలోని పలువురు రైతులు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. మొక్కలను అనంతపురం నుంచి తెచ్చుకుంటున్నాం. కలుపు రాకుండా మల్చింగ్ షీట్లను సబ్సిడీలో పొందాం.

– సుబ్బారెడ్డి, బొప్పాయి రైతు, బొమ్మవరం, అనంతసాగరం

యువ రైతులు ముందుకొస్తున్నారు



ఆత్మకూరు సెక్టార్‌లో బొప్పాయి సాగుకు ఆదరణ రెండేళ్లుగా పెరుగుతోంది. ఆధునిక పద్ధతుల్లో బొప్పాయిని సాగు చేసేందుకు యువ రైతులు ముందుకొస్తున్నారు. ప్రభుత్వం సైతం ప్రోత్సాహాన్ని అందిస్తుండటంతో గతంతో పోలిస్తే వందెకరాల్లో సాగు పెరిగింది.

– రాజశేఖర్‌రెడ్డి, ఉద్యానాధికారి, ఆత్మకూరు

గిరిజనుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

నెల్లూరు(దర్గామిట్ట): గిరిజనుల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని గిరిజన సంక్షేమ శాఖ, ఐటీడీఏ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి తొలుత జ్యోతి ప్రజ్వలన చేశారు. అంబేడ్కర్, వెన్నెలకంటి రాఘవయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం మంత్రి మాట్లాడారు. గిరిజన వర్గానికి చెందిన వారికి డిప్యూటీ సీఎం పదవిచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. తాను జెడ్పీ చైర్మన్‌గా ఉన్న సమయంలో జిల్లాలోని 360 గిరిజన కాలనీల్లో మంచినీటిని అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టానని గుర్తుచేశారు. భూ పంపిణీ కార్యక్రమంలోనూ గిరిజనులకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడారు. ఆదివాసీల పిల్లలు చదువుల్లో రాణించేందుకు గానూ గురుకుల పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు వసతులను కల్పించారని చెప్పారు. గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ స్కూళ్లలో చదివి పదో తరగతి పరీక్షల్లో 500కుపైగా మార్కులు సాధించిన తొమ్మిది మంది విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. తొలుత ఐటీడీఏ కార్యాలయం నుంచి కస్తూర్బా కళాక్షేత్రం వరకు జిల్లా అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పెద్ద ఎత్తున ర్యాలీని నిర్వహించారు. మేయర్ స్రవంతి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, జేసీ కూర్మనాథ్, ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్, డీడీ సోషల్ వెల్ఫేర్ రమేష్, సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి, డీటీడబ్ల్యూఓ పరిమళ, నేతలు పెంచలయ్య, రామచంద్రయ్య, చెంచయ్య పాల్గొన్నారు.

తేలు కుట్టిన దొంగ

- ఇదీ సోమిరెడ్డి పరిస్థితి
- టెంపో ప్రమాదానికి కారకుడు తన అనుచరుడవ్వడంతో గప్‌చుప్

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: గ్రావెల్ మాఫియాతో టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి ఉన్న సంబంధం బట్టబయలైంది. సర్వేపల్లి నియోజకవర్గంలో అనుమతుల్లేకుండా మట్టిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు తరలిస్తున్నారంటూ నిత్యం హడావుడి చేసే ఆయన నిజ స్వరూపం బహిర్గతమైంది. వెంకటాచలం మండలంలో గ్రావెల్ మాఫియా రింగ్ లీడర్ తన ముఖ్య అనుచరుడు బుజ్జినాయుడేనని నిర్ధారణ కావడంతో తేలు కుట్టిన దొంగలా సోమిరెడ్డి పరిస్థితి తయారైంది.

రింగ్ లీడర్ టీడీపీ నేత

వెంకటాచలంలోని కనుపూరు చెరువులో గ్రావెల్ తరలింపు కొంత కాలంగా జరుగుతోంది. పొదలకూరు మండలం సూరాయపాళేనికి చెందిన టీడీపీ నేత బుజ్జినాయుడు రైతుల పేరుతో అనుమతులు పొంది గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నారు. అతని సమీప బంధువుల టిప్పర్లతోనే అక్రమ రవాణా జరుగుతోంది. అయితే అసత్యాలను వ్యాప్తి చేయాలనే ఉద్దేశంతో గ్రావెల్ అక్రమ రవాణా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల కనుసన్నల్లో జరుగుతోందని సోమిరెడ్డి ఆరోపణలు చేశారు. కనుపూరు చెరువులో మట్టి రవాణా సాగుతోందని.. మంత్రి కాకాణి అనుచరులే చేయిస్తున్నారంటూ స్పందన కార్యక్రమంలో ఇటీవల ఫిర్యాదు చేశారు.



రోడ్డు ప్రమాదానికి కారణమైన టిప్పర్

కలెక్టర్ సక్రమంగా స్పందించలేదంటూ ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే.

టిప్పర్ ప్రమాదంతో వాస్తవాలు వెలుగులోకి..

వెంకటాచలం సమీపంలోని జాతీయ రహదారిపై కావలి వైపు వెళ్తున్న టెంపోను గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్ ఈ నెల ఆరో తేదీ సాయంత్రం ఢీకొంది. ప్రమాదంలో కావలి ఎస్‌బీఐ శాఖకు చెందిన ఎనిమిది మంది ఉద్యోగులతో పాటు టెంపో డ్రైవర్ గాయపడ్డారు. వీరిలో ఉద్యోగి రాజ్‌కుమార్ నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ క్రమంలో మంత్రి కాకాణి మట్టి మాఫియా బ్యాచ్ ఆగడాలకు బ్యాంక్ ఉద్యోగి బలి అంటూ సోషల్ మీడియాలో సోమిరెడ్డి పోస్టులు పెట్టించారు. అయితే టెంపోను ఢీకొన్న ఏపీ 39 యూజే 5888 నంబర్ గల టిప్పర్ సోమిరెడ్డి ముఖ్య అనుచరుడు దామినేని బుజ్జినాయుడిదిగా తేలింది.

తెల్లారేసరికి పోస్టులు డిలీట్

సోమిరెడ్డి అండదండలతో కొన్నేళ్లుగా బుజ్జినాయుడు తన టిప్పర్లతో గ్రావెల్ అక్రమ రవాణా చేస్తున్నారనే విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో సోషల్ మీడియా గ్రూపుల్లో పెట్టిన పోస్టులను వెంటనే తొలగించారు. అల్లీపురంలోని తన నివాసంలో బుజ్జినాయుడికి సోమిరెడ్డి ఆశ్రయమిచ్చారనే ఆరోపణలున్నాయి. గుడ్లూరువారిపాళెంలో పంచాయతీ ఆస్తులను ఇటీవల ధ్వంసం చేసిన కేసులో ఈపూరు సుబ్బారెడ్డిని అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్లో విచారణ చేస్తుంటే, అక్కడికి వచ్చి నానా హంగామా సృష్టించిన సోమిరెడ్డి ఈ వ్యవహారంలో మౌనంగా ఉంటున్నారు.

పోలీస్ అధికారిపై దబాయింపు

బుజ్జినాయుడ్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తన అనుచరుడినే అదుపులోకి తీసుకుంటారా అంటూ పోలీస్ అధికారినే సోమిరెడ్డి దబాయించారు. మీ అంతు చూస్తానంటూ బెదిరింపులకు దిగారు. బుజ్జినాయుడ్ని స్టేషన్ నుంచి వెళ్లిపోవాలని సోమిరెడ్డి ముందుగానే సలహా ఇచ్చారు. దీంతో ఆయన స్టేషన్ నుంచి వెళ్లిపోయారు. పరారీలో ఉన్న బుజ్జినాయుడితో పాటు మరో ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు.



సోమిరెడ్డిని సత్కరిస్తున్న గ్రావెల్ మాఫియా డాన్ బుజ్జినాయుడు (ఫైల్)

వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా అందజేత



నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాలకు సంబంధించిన ఆర్థిక సాయాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో బుధవారం జమ చేశారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో వర్చువల్‌గా నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ హరినారాయణన్, ఎమ్మెల్సీ కల్యాణ్ చక్రవర్తి హాజరయ్యారు. నమూనా చెక్కును అందజేసిన అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు వివాహాలు చేసుకున్న జిల్లాలోని 401 జంటలకు సంబంధించిన రూ.3.36 కోట్లను వారి ఖాతాల్లో జమ చేశారని వివరించారు. అనంతరం కల్యాణ్ చక్రవర్తి మాట్లాడారు. నిరుపేద తల్లిదండ్రులు తమ పిల్లల వివాహానికి అప్పులపాలు కాకుండా ఉండేందుకు ఈ పథకాలను సీఎం అమలు చేస్తున్నారని చెప్పారు. జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారిత అధికారి రమేష్, బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

మా జీవితాల్లో వెలుగులు నింపారు



బీఎస్సీ చదువుకుంటూనే వలంటీర్‌గా సేవలందిస్తున్నా. వైఎస్సార్ కల్యాణమస్తు ద్వారా ఆర్థిక సాయాన్ని అందుకోవడం చాలా ఆనందంగా ఉంది. పేద చేనేత కుటుంబానికి చెందిన నేను జీవితంలో ధైర్యంగా బతకగలననే భరోసా కల్పించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటా.

– కావ్య, ఇనమడుగు

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



ఇటీవలే వివాహం చేసుకున్నా. మా గ్రామ వలంటీర్ సాయంతో వైఎస్సార్ షాదీ తోఫా పథకానికి దరఖాస్తు చేసుకున్నా. పరిశీలించిన అధికారులు వెంటనే ఆర్థిక సాయాన్ని మంజూరు చేయడం ఆనందానికి గురిచేసింది. పెద్ద మొత్తంలో సాయం చేస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– మొహిద్దీన్, పదుగుపాడు

రౌడీయిజానికి టీడీపీ నేతల వత్తాసు

- ఓ రౌడీషీటర్ ద్వారా నగరంలో అలజడికి కుట్రలు
- హత్యాయత్నం కేసులో అరెస్టుకెళ్లిన పోలీసులపై దౌర్జన్యం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో టీడీపీ పరిస్థితి రోజురోజుకూ దిగజారిపోతుండటంతో ఆ పార్టీ నేతలు అడ్డదారులు తొక్కుతున్నారు. రౌడీషీటర్లను రెచ్చగొట్టి నగరంలో అలజడులు సృష్టించేందుకు కుట్రలు పన్నుతున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలపై మైనార్టీ నేతలతో దుష్ప్రచారం చేయిస్తూ.. మరోవైపు హత్యాయత్నాలతో అలజడులు సృష్టిస్తున్నారు. హత్యాయత్నం కేసులో నిందితుడైన మైనార్టీ నేతకు టీడీపీ అండగా నిలిచి పోలీసులపైనే బెదిరింపులకు పాల్పడింది.

పుంగనూరు ఫార్ములా అమలుకు యత్నం

టీడీపీ అధినేత చంద్రబాబు చిత్తూరు జిల్లా పుంగనూరులో పోలీసులను టార్గెట్ చేసి ఇటీవల రక్తపాతాన్ని సృష్టించారు. ఇదే ఫార్ములాను అన్ని చోట్ల అమలు చేసేందుకు టీడీపీ నేతలు యతిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగరంలో ఇటీవల చోటు చేసుకుంటున్న పరిణామాలు దీనికి ఉదాహరణగా నిలుస్తున్నాయి.

ప్రశాంత నగరంలో అలజడికి ప్లాన్

ప్రశాంతతకు మారుపేరైన నెల్లూరు నగరంలో అశాంతిని టీడీపీ నేతలు రేపుతున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండైన ఓ ప్రజాప్రతినిధి కొన్నేళ్లుగా అరాచక పాలన సాగించిన విషయం తెలిసిందే. రౌడీయిజానికి ఈయన అండగా నిలుస్తున్నారనే ఆరోపణలున్నాయి. నిత్యం వివాదాలు.. కేసులతో హడావుడి చేసే ఓ టీడీపీ నేత వీరికి తోడయ్యారు.

సమీపై మరోసారి రౌడీషీట్

నగరంలోని కోటమిట్టకు చెందిన సయ్యద్ సమీ హుస్సేనీపై రౌడీ షీట్ రెండోసారి ఓపెనైంది. గతంలో పలు కేసుల్లో నిందితుడైన ఈయనపై ఉన్న రౌడీషీట్‌ను గత ప్రభుత్వ హయాంలో ఎత్తేశారు. ఆయనపై ఇప్పటికే నాలుగు కేసులున్నాయి. బారాషహీద్ దర్గా ఆవరణలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ నేతపై గతంలో హత్యాయత్నానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. ఆ కేసులో జైలుకెళ్లి బెయిల్‌పై వచ్చిన సమీ తాజాగా రొట్టెల పండగ సందర్భంగా నదీముద్దీన్‌పై హత్యాయత్నానికి పాల్పడటంతో దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. ఆయన్ను అరెస్ట్ చేసేందుకు పోలీసులు వెళ్లగా, టీడీపీకి చెందిన ఎమ్మెల్యేతో పాటు ఆ పార్టీ నేత హడావుడి చేశారు.

ఆది నుంచి వివాదాస్పదుడే..

ఇండియన్ నేషనల్ లీగ్ రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న సమీ ఆది నుంచి వివాదాస్పదుడే. ఆయన్ను టీడీపీ నేతలు వెనుకేసుకొస్తున్నారు. రొట్టెల పండగ సమయంలోనూ వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులపై దుష్ప్రచారం చేయించారు. సమీని అరెస్ట్ చేసేందుకు వెళ్లిన సమయంలో టీడీపీ నేతలు రెచ్చగొట్టినా పోలీసులు సంయమనం పాటించారు. ఓ ఎస్సైతో టీడీపీ నేత కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అనుచితంగా ప్రవర్తించినా ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

పొగాకు అత్యధిక ధర రూ.288

కందుకూరు : వేలం చివరి రోజుల్లో పొగాకు రేట్లు దుమ్మురేపుతున్నాయి. రికార్డు ధరలు నమోదవుతూనే ఉన్నాయి. ఈ ఏడాదికి అత్యధిక ధర బుధవారం వేలంలో నమోదైంది. కందుకూరు–1 వేలం కేంద్రంలో జరిగిన పొగాకు వేలంలో కేజీ ధర రూ.288 పలికింది. కాగా ఈ ఏడాదిలో ఇదే రికార్డు ధర కావడం గమనార్హం. ఈ కేంద్రంలో మొత్తం 901 బేళ్లను వేలానికి ఉంచగా 813 బేళ్లు విక్రయించారు. అలాగే కేజీ పొగాకు అత్యల్ప ధర రూ.173 నమోదైంది. దీంతో సీజన్‌లోనే అత్యధిక సరాసరి ధర రూ.274 నమోదైంది. అదే సందర్భంలో గోడౌన్ నిండిపోవడంతో రెండో వేలం కేంద్రంలో బుధవారం వేలాన్ని నిలిపివేశారు.

పక్కాగా ఓటర్ల జాబితా సవరణ



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (దర్గామిట్ట) : ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికలాధికారి ఎం.హరినారాయణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరంలోని కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణంలో జిల్లాలోని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, అదనపు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులతో బుధవారం సాయంత్రం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమం –2024కు సంబంధించిన పలు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. ఇంటింటి సర్వే, ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించి స్వచ్ఛమైన ఓటరు జాబితాను రూపొందించడంలో అధికారుల పాత్ర కీలకమన్నారు. ఒకే డోర్ నంబరుపై ఎక్కువ ఓటర్లు నమోదైన లేదా దరఖాస్తులు వచ్చినా వాటిపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. కొత్త ఓటర్ల నమోదుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో జేసీ ఆర్.కూర్మనాథ్, నెల్లూరు నగరపాలక కమిషనర్ వికాస్ మర్మత్, కందుకూరు సబ్‌కలెక్టర్ శోభిక, అసిస్టెంట్ కలెక్టర్ సంజనా సిన్హా, డీఆర్వో వెంకట నారాయణమ్మ, ఆర్డీఓలు శీనానాయక్, కరుణకుమారి పాల్గొన్నారు.

అందరూ సహకరించాలి

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పారదర్శకంగా ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తున్నామని, ఇందుకు అన్ని రాజకీయ పక్షాలు సహకారం అందించాల్సిందిగా కలెక్టర్ హరినారాయణన్ సూచించారు. కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాల్సిందిగా సూచించారు. ఎన్నికల అధికారులకు సహకరించాల్సిందిగా కోరారు.

మహిళలపై కానిస్టేబుల్ దురుసు ప్రవర్తన

- సస్పెండ్ చేయాలని పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా



పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ కృష్ణ తమపై దురుసుగా ప్రవర్తించి అసభ్య పదజాలంతో దూషించాడని, అతన్ని సస్పెండ్ చేయాలని కోరుతూ పోలీస్‌స్టేషన్ ఎదుట మహిళలు బుధవారం ధర్నా చేశారు. వివరాలిలా ఉన్నాయి. వింజమూరు గంగమిట్టకు చెందిన మహిళలు మంగళవారం అర్ధరాత్రి స్థానిక సబ్‌స్టేషన్‌కు వెళ్లి విద్యుత్ సరఫరా నిలిపివేతపై సిబ్బందిని నిలదీసి ఆందోళన చేశారు. దీంతో కొందరు కానిస్టేబుళ్లు సబ్‌స్టేషన్ వద్దకు చేరుకొని మహిళలకు సర్దిచెప్పే ప్రయత్నం చేస్తున్న నేపథ్యంలో కానిస్టేబుల్ కృష్ణ మహిళలనుద్దేశించి అసభ్య పదాలు ఉపయోగించాడు. ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనడంతో కొంతమంది పెద్దలు జోక్యం చేసుకొని సమస్యను సర్దుమణిగేలా చేశారు. అయితే తీవ్ర కలత చెందిన మహిళలు, వారి బంధువులు బుధవారం ఉదయం పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకొని కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేయాలని ధర్నాకు దిగారు. ఎస్సై కోటిరెడ్డి వారికి సర్దిచెప్పి కానిస్టేబుల్‌పై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యుత్ సమస్యను కూడా త్వరలో పరిష్కరిస్తామని జెడ్పీటీసీ బాలకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు విజయకుమార్‌రెడ్డి, కొండారెడ్డి, కాలేషా తదితరులు హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. విద్యుత్ సమస్యను ఏఈ శ్రీనివాసరావు దృష్టికి సాక్షి తీసుకెళ్లగా గంగమిట్టలో లోఓల్టేజీ సమస్య ఉందని, దీనివల్ల విద్యుత్ అంతరాయం ఏర్పడుతోందన్నారు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్ మంజూరైందని, రెండు మూడు రోజుల్లో పనులు పూర్తిచేసి విద్యుత్ సమస్యను పరిష్కరిస్తామన్నారు.

జీవవైవిధ్యం ఎంతో కీలకం

- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



నెల్లూరు(పొగతోట) : ప్రకృతితో ప్రాణకోటి మనుగడకు జీవవైవిధ్యం ఎంతో కీలకమని, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. నెల్లూరు నగరంలోని జెడ్పీ కార్యాలయంలో జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ చిగురుపాటి ప్రసన్నలక్ష్మి, సీఈఓ బి.చిరంజీవితో కలిసి బయో డైవర్సిటీ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సృష్టిలోని జీవరాశుల మధ్య భిన్నత్వమే జీవ వైవిధ్యమని తెలిపారు. దాదాపు మూడు కోట్లకుపైగా వివిధ జాతులకు చెందిన చెట్లు, వన్యప్రాణులు, సూక్ష్మజీవరాశులు మానవునితో కలిసి సహజీవనం చేస్తున్నాయన్నారు. ఆహారం, దుస్తులు, ఉండటానికి నీడ, అలంకరణ, వ్యాధుల చికిత్సలకు మందులు, ఆధ్యాత్మిక, ఆర్థిక శాస్త్ర విజ్ఞానం, సాంకేతిక అవసరాలకు జీవ వైవిధ్యం కీలకమన్నారు. మనం తినే ఆహారంలో 97 శాతం మొక్కలు, మూడు శాతం జంతువులు అందిస్తున్నాయన్నారు. ప్రస్తుతం, రాబోయే తరాలకు ఆహారం, తీవ్రమైన ప్రాణాంతక వ్యాధుల చికిత్సకు ఔషధ మొక్కలు, సముద్ర జీవరాశుల ద్వారా మాత్రమే సమకూరుతాయన్నారు. 2006లో రాష్ట్రంలో జీవవైవిధ్య మండలి ఏర్పాటైందన్నారు. రాష్ట్రంలోని అన్ని సంస్థల్లో జీవ వైవిధ్య యాజమాన్య కమిటీలు ఏర్పాటు చేశారన్నారు. ఈ కమిటీల్లో మహిళలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కుటుంబ సభ్యులకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడంలో మహిళలు ప్రత్యేక శ్రద్ధ వహిస్తారని తెలిపారు.

నవోదయలో ప్రవేశానికి గడువు పొడిగింపు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు) : మర్రిపాడు మండలంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2022–23 సంవత్సరంలో ప్రవేశానికి గడువును 17వ తేదీ వరకు పొడిగించారని విద్యాలయ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ వారు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఇతర వివరాల కోసం హెల్ప్‌డెస్క్ నంబర్ 89850 07588ను సంప్రదించాలని కోరారు.



పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.40
సన్నవి	: రూ.20
పండ్లు	: రూ.7

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.130
లేయర్	రూ.88
బ్రాయిలర్ చికెన్:	రూ.226
స్కిన్‌లెస్ చికెన్:	రూ.250
లేయర్ చికెన్:	రూ.150

విద్యార్థుల హాజరు తగ్గకూడదు

- డీఈఓ గంగాభవాని



మాట్లాడుతున్న డీఈఓ గంగాభవాని

ఆత్మకూరు : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం తగ్గకుండా చూడాల్సిన బాధ్యత హెచ్ఎంలు, ఎంఈఓలపై ఉందని జిల్లా విద్యాశాఖాధికారి గంగాభవాని అన్నారు. కావలి డివిజన్ పరిధిలోని ఎనిమిది మండలాల ఎంఈఓలు, హెచ్ఎంలు, రిసోర్స్‌పర్సన్లతో ఆత్మకూరులో ఆమె బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు సరైన వసతులు కల్పిస్తుండడంతో పాటు నూతన భవనాలను ఏర్పాటు చేయడం, అమ్మఒడి పథకం వల్ల కొంత కాలంగా ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం గణనీయంగా పెరిగిందన్నారు. అయితే 2022–23 విద్యా సంవత్సరంలో కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం తగ్గిందని, దీని కారణాలను పరిశీలించాలని ఆమె సూచించారు. ప్రతి విద్యార్థి నోట్ పుస్తకాలను పరిశీలించామని తెలిపారు. విద్యార్థులు యూనిఫామ్, టై, బెల్టు, షూ వేసుకుని వచ్చేలా చూడాలన్నారు. మధ్యాహ్న భోజన నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. వీటి బాధ్యతలు ఆయా పాఠశాలల హెచ్ఎంలే నిర్వహించాలన్నారు. ఎంఈఓలు క్రమం తప్పకుండా పాఠశాలలను తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి రఘురామయ్య, ఆత్మకూరు ఎంఈఓ నజీర్‌బాషా, పలు పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

అణువిజ్ఞాన శాస్త్రంపై అవగాహన అవసరం



శాస్త్రవేత్తలను సత్కరించిన నవోదయ ఉపాధ్యాయులు, అధ్యాపకులు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు) : అణువిజ్ఞాన శాస్త్రంలో భారతదేశం ప్రపంచంలో అగ్రశ్రేణికి చేరిందని, దీనిపై విద్యార్థులు చిన్నతనం నుంచే అవగాహన పెంచుకోవాల్సిన అవసరముందని ముంబైకు చెందిన బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ శాస్త్రవేత్తలు డాక్టర్ పృథ్వీష్ సిన్హా రాయ్, డాక్టర్ ఉత్తమ్‌జైన్ పేర్కొన్నారు. మర్రిపాడు మండలంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో పరమాణు జ్యోతి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు శాస్త్ర, అణు విజ్ఞానం పట్ల బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. పరమాణు ఉపయుక్తంలో రేడియేషన్ పట్ల ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. అణుశాస్త్రం ద్వారా కేన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధులను నయం చేయవచ్చన్నారు. డాక్టర్ హోమీ బాబా, డాక్టర్ విక్రమ్ సారాభాయ్ తదితర శాస్త్రవేత్తలు అణు విజ్ఞానంపై చేసిన కృషిని వీడియో ద్వారా ప్రదర్శించి విద్యార్థులకు వివరించారు. శాస్త్ర, అణు విజ్ఞానంపై నిర్వహించిన క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ గౌసియా బేగం, బోధన సిబ్బంది, విద్యార్థులతో కలిసి శాస్త్రవేత్తలను సన్మానించారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య



శ్రీలేఖ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శివకృష్ణారెడ్డి

ముత్తుకూరు : ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన ముత్తుకూరులో జరిగింది. ఎస్సై శివ కృష్ణారెడ్డి కథనం మేరకు.. పంట పాళెం పంచాయతీలోని కోళ్లమిట్టకు చెందిన నాసిన శ్రీలేఖ (28) అనే వివాహిత భర్తతో విభేదించి ముత్తుకూరు బీసీ కాలనీలో నివాసం ఉంటోంది. కొద్ది నెలలుగా దుర్గాప్రసాద్ అనే వ్యక్తితో సహజీవనం చేస్తోంది. అయితే, ఇటీవల వీరిద్దరి మధ్య మనస్పర్థలు మొదలయ్యాయి. గొడవలు ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం ఇద్దరి మధ్య తీవ్రస్థాయిలో గొడవలు జరిగాయి. దుర్గాప్రసాద్ వెలుపలకు వెళ్లగానే శ్రీలేఖ ఇంట్లోని ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకొని మృతి చెందింది. కొద్దిసేపటికి వచ్చిన దుర్గాప్రసాద్ ఇంటి తలుపులు వేసి ఉండడంతో గట్టిగా కేకలు వేసినా తలుపులు తెరవలేదు. చుట్టుపక్కల వారి సాయంతో తలుపులు పగులగొట్టి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ శ్రీలేఖ కనిపించింది. సమాచారం అందుకున్న ఎస్సై తన సిబ్బందితో మృతదేహాన్ని కిందకు దించి, పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.